

నాణ్యతే ప్రధానం

రైతులకు ఎరువులు, పురుగు మందుల నాణ్యతగా అందించాలనే లక్ష్యంతో వ్యవసాయశాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. దుకాణాల్లో తనిఖీలు చేస్తున్నారు. -8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.58,550
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,230
3 శాతం జీఎస్టీతో	రూ.5,387
సవర (8 గ్రా)	రూ.43,096

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 30.3 /21.3

జిల్లా వ్యాప్తంగా బుధవారం వాతావరణం పొడిగా ఉంటుంది. కనిష్ట ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గడంతో చలితీవ్రత పెరిగింది. గాలిలో తేమ 58 శాతం ఉంది.

న్యూస్‌రీల్

జాతీయ వ్యవసాయ శాస్త్రవేత్తగా బొమ్మవరం మహిళ



అక్కలరెడ్డి సుమలత

సోమశిల: అనంతసాగరం మండలం బొమ్మవరానికి చెందిన అక్కలరెడ్డి సుమలత కేంద్ర వ్యవసాయశాఖ శాస్త్రవేత్తగా ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన ఎంపికల్లో మొత్తం 200 శాస్త్రవేత్తల పోస్టులు ఉండగా ఉద్యానవనశాఖలో 15 మాత్రమే ఉంటే జాతీయ స్థాయిలో 15 మందిలో ఆమె ఎంపిక అయ్యారు. స్థానిక సచివాలయ కన్వీనర్ అక్కలరెడ్డి వెంకటలక్ష్మమ్మ, వెంకటరెడ్డి కుమార్తె సుమలత జాతీయ స్థాయిలో గ్రామానికి గుర్తింపు తీసుకురావడంపై గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ అక్కలరెడ్డి అంకిరెడ్డి ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. హైదరాబాద్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్‌లో మూడు నెలల పాటు శిక్షణ అనంతరం పూలసాగు, పెంపకాలపై బాధ్యతలు చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు.

నేడు జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక

కోవూరు: త్వరలో విశాఖపట్నంలో జరగనున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టును బుధవారం సాయంత్రం 3 గంటలకు ఎంపిక చేయనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి టి.లవకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలు కోవూరు బాలిక ఉన్నతపాఠశాలలో జరుగుతాయన్నారు. 22 ఏళ్ల పైబడిన మహిళలు, పురుషుల విభాగాల్లో జట్లను ఎంపిక చేస్తామన్నారు. మహిళలు 75 కేజీల లోపు, పురుషులు 85 కేజీల లోపు బరువు కలిగి ఉండాలన్నారు. ఎంపిక రోజు ఆధార్ కార్డు తప్పక తీసుకురావాలన్నారు. ఈ నెల 25, 26, 27 తేదీల్లో విశాఖపట్నం జిల్లా అనకాపల్లి మండలం అంకుపాలెంలో జరిగే 70వ సీనియర్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. వివరాలకు 9866326830 నంబరులో సంప్రదించాలని కోరారు.

జిల్లా పెన్షనర్ల సంఘ సమావేశం రేపు

నెల్లూరు (బృందావనం): జిల్లా పెన్షనర్ల సర్వసభ్య సమావేశం సాయంత్రం గురువారం సాయంత్రం 4 గంటలకు జరుగుతుందని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్‌ఎంగౌస్, ఎస్వీఎన్ మూర్తి మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. నగరంలోని భక్తవత్సలనగర్‌లోని పెన్షనర్ల సంక్షేమ సంఘ భవనంలో జరిగే ఈ సమావేశంలో ఆధార్ సీఎఫ్‌ఎంఎస్ లింక్ చేయడం, హెచ్‌ఈఆర్‌బీ అప్లికేషన్, నెలవారీ పెన్షన్ ఆదాయపు పన్ను తగ్గించే విషయం తదితర సమస్యలపై చర్చ ఉంటుందన్నారు. జిల్లాలోని పెన్షనర్లు సమావేశానికి హాజరై జయప్రదం చేయాలని వారు కోరారు.

సోమశిలలో 71.496 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 71.496 టీఎంసీలున్నాయి. జలాశయానికి పైతట్టు ప్రాంతాల నుంచి 1,911 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది. జలాశయం నుంచి పెన్నార్ డెల్టాకు 1,170, ఉత్తరకాలువకు 550, దక్షిణ కాలువకు 320, కండలేరుకు 50 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. సగటున 327 క్యూసెక్కులు ఆవిరవుతోంది.

దాణా పంపిణీ



దాణా పంపిణీ చేసిన దృశ్యం

కోవూరు: మండల కేంద్రంలోని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో మంగళవారం దూడల కోసం మిశ్రమ దాణా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఒక్కో మగదూడకు 25 కేజీల చొప్పున 8 బస్తాలు రూ.4,500 విలువైన దాణాను పంపిణీ చేశారన్నారు. దూడలకు సంవత్సరం వరకు దాణా పంపిణీలో భాగంగా రూ.9,400ను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో పశుగణాభివృద్ధి సంస్థ నిర్వాహణాధికారి డాక్టర్ టి.సోమయ్య, పశు వైద్యులు వసంతరాయులు, డీఎల్‌డీఏ డైరెక్టర్లు మల్లికార్జునరావు, వెంకటరమణయ్య పాల్గొన్నారు.

పరీక్షా కాలం

సంక్రాంతి పండగ సెలవులు పూర్తయ్యాయి. ఆటపాటలతో గడిపిన విద్యార్థులు ముంచుకొస్తున్న పరీక్షలకు సన్నద్ధం కావాల్సిన సమయం ఆసన్నమైంది. వరుస పరీక్షలతో రానున్న 4 నెలలు బిజీబిజీగా గడపనున్నారు. తమ ముందున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు మెదడుకు పదును పెట్టనున్నారు. మరోవైపు ఆయా కోర్సుల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులు సిలబస్‌ను పూర్తి చేసి రివిజన్‌తో పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. పరీక్షలు దగ్గర పడుతుండడంతో తమ పిల్లలు చదువుపై పూర్తిగా శ్రద్ధ పెట్టే విధంగా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

- వరుస పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు
- ఈ నెల 19 నుంచి డిగ్రీ 3వ సెమిస్టర్ పరీక్షలు
- 24వ తేదీ నుంచి జేఈఈ మెయిన్స్
- ఫిబ్రవరి 26 నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్
- మార్చి 15వ తేదీ నుంచి ఇంటర్ పబ్లిక్ పరీక్షలు
- ఏప్రిల్ 3 నుంచి పది తరగతి పరీక్షలు
- ఏప్రిల్ 6 నుంచి 12 వరకు రెండో విడత జేఈఈ మెయిన్స్
- మే 7న నీట్, జూన్ 4న అడ్వాన్స్‌డ్ పరీక్షలు
- పరీక్షలకు హాజరుకానున్న 1.5 లక్షల మందికి పైగా విద్యార్థులు



కేవీఆర్ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులు

నెల్లూరు (టౌన్): ఈ నెల మూడో వారం ప్రారంభం నుంచి జూన్ వరకు విద్యార్థుల భవిష్యత్‌కు కీలకమైన పరీక్షలు జరగనున్నాయి. ప్రధానంగా టెన్త్, ఇంటర్ విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలతో పాటు జేఈఈ, నీట్, అడ్వాన్స్‌డ్ పరీక్షలు వరుసగా ఉన్నాయి. ఈ నెల 19వ తేదీ నుంచి డిగ్రీ 3వ సెమిస్టర్‌తో ప్రారంభం కానున్న పరీక్షలు జూన్ 4వ తేదీతో పూర్తి కానున్నాయి. ఆయా పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 1.5 లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరుకానున్నారు. ఆయా విద్యా సంస్థలు సైతం తమ కళాశాలల్లో చదివే విద్యార్థుల ర్యాంకులపై దృష్టి సారించాయి.

ఈ నెల 24 నుంచి 31వ తేదీ వరకు తొలి విడత జేఈఈ మెయిన్స్ పరీక్ష జరగనుంది. వచ్చే నెల 26వ తేదీ నుంచి మార్చి 7 వరకు ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ప్రాక్టికల్స్ జరగనున్నాయి. మార్చి 15 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు ఇంటర్ పబ్లిక్ పరీక్షలను నిర్వహించనున్నారు. ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. ఏప్రిల్ 6 నుంచి 12వ తేదీ వరకు రెండో విడత జేఈఈ మెయిన్స్ పరీక్షను నిర్వహించనున్నారు. వీటితో పాటు ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు మే 7న నీట్, జూన్ 4న జేఈఈ అడ్వాన్స్ డ్ పరీక్షలు జరగనున్నాయి. వీటితో పాటు ఎంసెట్ పరీక్షను కూడా అదే నెలలో నిర్వహించనున్నారు. ఈ నెల 19వ తేదీ నుంచి డిగ్రీ 3వ సెమిస్టర్, వచ్చే నెల 1వ తేదీ నుంచి 1వ సెమిస్టర్ పరీక్షలను నిర్వహించనున్నారు. మే నెలలో డిగ్రీ తృతీయ సంవత్సర విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. దీంతో పాటు ఇంజినీరింగ్ పరీక్షలు కూడా మే నెలాఖరు లేదా జూన్ నెలలో నిర్వహించనున్నారు.

పరీక్షలకు 1.5 లక్షల మంది సిద్ధం

జిల్లాలోని ఆయా కళాశాలల్లో పది, ఇంటర్, డిగ్రీ తదితర కోర్సులు చదువుతున్న 1.5 లక్షల మందికి పైగా విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. వీరంతా ఆయా కోర్సుల్లో పబ్లిక్ పరీక్షలతో పాటు పోటీ పరీక్షలకు హాజరుకానున్నారు. కొత్త జిల్లా వ్యాప్తంగా 10వ తరగతి రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు కలిపి మొత్తం 29,401 మంది విద్యార్థులు, ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఇంటర్ పరీక్షలు ప్రథమ 27,496, ద్వితీయ సంవత్సరం 28,225 మంది కలిపి మొత్తం 55,721 మంది విద్యార్థులు, డిగ్రీ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి మొత్తం 40 వేల మందికి పైగా విద్యార్థులు, ఇంజినీరింగ్‌కు సంబంధించి 4 ఏళ్లు కలిపి మొత్తం 20 వేల మందికి పైగా విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

ఫలితాలు, ర్యాంకులపై సాధన

ఆయా కోర్సుల్లో పరీక్షలకు సంబంధించి ఉత్తమ ఫలితాలు, ర్యాంకులు సాధనలో అధ్యాపకులు, ఉపాధ్యాయులతో పాటు ఆయా విద్యా సంస్థల యాజమాన్యాలు సాధన పెడుతున్నాయి. పదో తరగతి పరీక్షలకు సంబంధించి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 20న మెటీరియల్స్‌ను పంపిణీ చేయనున్నారు. ప్రతి రోజు స్లిప్ టెస్ట్ నిర్వహించి వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదు ఇవ్వనున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు రివిజన్ కూడా పూర్తి చేసి రోజువారీ పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఇంటర్‌కు సంబంధించి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సిలబస్ పూర్తి చేసి పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సిలబస్ పూర్తి చేసి జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్, నీట్, ఎంసెట్ పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులను కూడా ఆ యాజమాన్యాలు పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు.

పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నాం

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నాం. ఈ నెల 30 నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు ప్రీ ఫైనల్ పరీక్షలు జరగనున్నాయి. ఏ కళాశాలలో అయినా సిలబస్ పూర్తికాకుంటే ఈ నెలాఖరు లోపు పూర్తి చేయాలని ఆదేశించాం. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని అందరు ప్రిన్సిపాల్స్‌కు సమాచారం పంపాం. గత విద్యా సంవత్సరం ఫలితాలు కంటే మెరుగైన ఫలితాలు సాధించేలా విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం.

– మధుబాబు, డీవీఈఓ

20 నుంచి రోజూ స్లిప్ టెస్ట్‌లు

ఈనెల 20 నుంచి పదో తరగతి విద్యార్థులకు మెటీరియల్ అందజేస్తున్నాం. మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రతి రోజు స్లిప్ టెస్ట్ నిర్వహించాలని ఆదేశించాం. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నాం. గత విద్యా సంవత్సరం కంటే ఈ విద్యా సంవత్సరంలో మెరుగైన ఫలితాలు సాధించేలా అన్ని ఉన్నత పాఠశాలల ప్రిన్సిపాల్స్‌కు గైడ్‌లైన్స్‌ను ఇచ్చాం.

– సుబ్బారావు, ఇన్‌చార్జి డీఈఓ

ముగ్గురు తహసీల్దార్ల సస్పెన్షన్

- రెవెన్యూశాఖలో కలకలం

నెల్లూరు(అర్బన్): జిల్లా రెవెన్యూశాఖలో అవినీతి అధికారులపై వరుసగా వేటు పడుతోంది. ఇటీవల బుచ్చిరెడ్డిపాళెం తహసీల్దార్ ప్రమీలను కలెక్టర్ సస్పెండ్ చేశారు. తాజాగా వెంకటాచలం తహసీల్దార్ నాగరాజు, తోటపల్లిగూడూరు తహసీల్దార్ హమీద్, గుడ్లూరు తహసీల్దార్ లావణ్యను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. అవినీతికి అలవాటు పడిన అధికారులు రెవెన్యూ రికార్డులు తారుమారు చేయడం, ప్రభుత్వ భూములను పట్టా భూములుగా చూపించి పరిహారం ఇవ్వడం, చివరికి మర్రిపాడు ప్రాంతంలో అటవీశాఖ భూములను సైతం పట్టా భూములుగా చూపడం వంటి అక్రమాలకు పాల్పడుతున్నారు. వీటిపై చివరకు స్పందన కార్యక్రమంలో సైతం ప్రజలు తహసీల్దార్లు అర్జీలు సమర్పిస్తున్నారు. విషయాన్ని పరిశీలించిన కలెక్టర్ చక్రధర్‌బాబు విచారణాధికారిగా జేసీ కూర్మనాథ్‌ను నియమించారు. జేసీ విచారణలో విస్తూ పోయే నిజాలు వెలుగు చూశాయి. కలువాయి మండలంలో ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తులదిగా చూపి అక్రమార్కులకు అండగా నిలిచారు. గుడ్లూరు మండలంలో ప్రభుత్వ భూమిని మ్యుటేషన్ చేశారు. ఇలా పలు చోట్ల అక్రమాలకు పాల్పడిన తహసీల్దార్లను గుర్తించి సస్పెండ్ వేటు వేశారు. ఈ విషయం రెవెన్యూ శాఖలో జిల్లా వ్యాప్తంగా కలకలం రేగింది. మరో ఆరుగురిని విచారించేందుకు జేసీ నోటీసులు సిద్ధం చేస్తున్నారు. ఇందులో రిటైర్డ్ అయిన రెవెన్యూ అధికారులు సైతం ఉన్నారు. పూర్తి స్థాయిలో విచారణ జరిగితే మరి కొంత మందిపై వేటు పడే అవకాశం ఉంది.

పదోన్నతులు పొందిన ఎస్‌ఏలకు కౌన్సెలింగ్

నెల్లూరు (టౌన్): ఇటీవల ఆయా పాఠశాలల్లో పనిచేస్తున్న ఇంగ్లిష్ ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్‌లుగా పదోన్నతులు కల్పించారు. వారిలో జిల్లా పరిషత్ నుంచి 38 మంది, ప్రభుత్వ పాఠశాలల నుంచి ఒకరు, ఇతర భాషల 15 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. స్కూల్ అసిస్టెంట్‌లుగా పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు మంగళవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లు కల్పించారు. వీరందరూ రెండు మూడు రోజుల్లో పోస్టులు కల్పించిన ప్రదేశాల్లో జాయిన్ కావాలని ఇన్‌చార్జి డీఈఓ సుబ్బారావు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏడీ నారాయణరావు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం చేయడమే లక్ష్యం



ఇళ్ల స్థలాల మంజూరు పత్రాలను పంపిణీ చేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: రాష్ట్రంలో అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి, వారి సొంతింటి కల సాకారం చేయడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద ఎత్తున ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. వెంకటాచలంలోని జగనన్న కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను మంత్రి కాకాణి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కొత్తగా పలువురు లబ్ధిదారులకు ఇంటి స్థలాల మంజూరు పత్రాలను అందజేశారు. మంత్రి కాకాణి మాట్లాడుతూ వెంకటాచలం జగనన్న కాలనీ లేఅవుట్‌లో లబ్ధిదారులు 300 ఇళ్ల నిర్మించుకునేందుకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశామన్నారు. గతంలో అరకొర మందికి పట్టాలిచ్చినా.. ఎక్కడో సభలు పెట్టి పట్టాలు ఇచ్చి వెళ్లిపోయే వారని, ఆ పట్టాలు తీసుకున్న లబ్ధిదారులకు స్థలాలు చూపించకపోవడంతో అధికారులు చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదని గుర్తు చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇళ్ల స్థలాలు పంపిణీ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ప్రతి గ్రామంలో లేఅవుట్ వేసి, అక్కడే సభ పెట్టి లబ్ధిదారులకు ఇంటి పట్టా ఇవ్వడమే కాకుండా, ఇంటి స్థలం కూడా చూపించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎవరికీ సాధ్యం కాని విధంగా ఇళ్ల పట్టాలు పంపిణీ చేయడంతో పాటుగా, ఇళ్లు కట్టిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. లేఅవుట్లలో అన్ని మౌలిక వసతులు కల్పిస్తూ లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్లు నిర్మించుకునేలా చర్యలు చేపడుతున్నామన్నారు. గిరిజన కుటుంబాలకు ప్రభుత్వం అందజేస్తున్న రూ.1.80 లక్షలతో పాటు అదనంగా మరో రూ.15 వేలు సాయం చేస్తున్నామని తెలియజేశారు. గత ప్రభుత్వ హయాంలో ఏ ఒక్కరికీ ఇంటి స్థలం కానీ, ఇంటి నిర్మాణం కానీ మంజూరు కాలేదని గుర్తు చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అర్హత కలిగిన ప్రతి పేదవాడికి ఇల్లు కట్టిస్తున్నామన్నారు. అర్హులందరికీ ఇళ్లు కట్టిస్తుంటే ఓర్వలేక కొందరు కోర్టులకు వెళ్లి ఇళ్ల నిర్మాణాలను అడ్డుకునే కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా రాష్ట్రంలో ఇళ్ల నిర్మాణాలను అడ్డుకోలేరని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ సుస్మిత, మండల వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పోట్లూరు సుబ్రహ్మణ్యం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య, ఎంపీటీసీ వేమారెడ్డి రఘునందన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మందల పెంచలయ్య, మందల మోహన్‌రావు, వెలిబోయిన వెంకటేశ్వర్లు, చీకుర్తి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ రివిజన్ అమలు చేయాలి

- సర్కిల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి జిలానీఖాన్



బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం ఎదుట పెన్షనర్ల నిరసన

నెల్లూరు (మినీబైపాస్): భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ పెన్షనర్స్‌కు పెన్షన్ రివిజన్ అమలు చేయాలని సర్కిల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.జిలానీఖాన్ డిమాండ్ చేశారు. భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పిలుపు మేరకు రెండు రోజుల నిరసన కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయ ఆవరణలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ గళాన్ని వినిపించారు. ఏఐబీఎస్‌ఎన్‌ఎల్ పీడబ్ల్యూఏ జిల్లా కార్యదర్శి కె.సూర్యనారాయణ, మాజీ జిల్లా కార్యదర్శి మహబూబ్ పీరా, జిల్లా ఉపాధ్యక్షుడు చాంద్ సాహెబ్, పెన్షనర్లు పాల్గొన్నారు.

ఏప్రిల్ నాటికి పూర్తిస్థాయిలో గృహప్రవేశాలు

- జిల్లాకు 63 వేల ఇళ్లు మంజూరు
- ప్రతి శనివారం హౌసింగ్ డే నిర్వహించాలి
- ప్రతి వారం రూ.2 కోట్ల నిధుల మంజూరు
- కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు



ఇంటి నిర్మాణ నాణ్యతను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

బుచ్చిరెడ్డిపాళెం: నవరత్నాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు దాదాపు 63 వేలకు పైగా ఇళ్లను మంజూరు చేశామని కలెక్టర్ కేవీఎన్ చక్రధర్ బాబు తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని కట్టుబడిపాళెం, మండలంలోని రెడ్డిపాళెం గ్రామాల్లో జగనన్న లేఅవుట్లలో నిర్మిస్తున్న ఇళ్లను మంగళవారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్లులేని వారు ఉండకూడదని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని, ఇందులో భాగంగా నిర్మిస్తున్న ఇళ్లను ఏప్రిల్ నాటికి పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేసే విధంగా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ప్రతి శనివారం హౌసింగ్ డేగా సచివాలయం ఇంజినీర్ అసిస్టెంట్‌తో పాటు, గృహనిర్మాణ శాఖ ఏఈ నుంచి జిల్లా స్థాయి అధికారులంతా ఆ రోజు వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసే విధంగా శ్రద్ధ చూపాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో నిర్మాణ లబ్ధిదారులకు ప్రతి వారం రూ.2 కోట్ల వరకు వారి ఖాతాల్లో బిల్లులు జమ చేస్తున్నామన్నారు. లబ్ధిదారులకు బ్యాంకుల ద్వారా కూడా రుణాలను మంజూరు చేయిస్తున్నామని, దీనిపై అధికారులు అవగాహన కల్పించి రుణాలు మంజూరయ్యే విధంగా కృషి చేయాలని ఆదేశించారు. జగనన్న లేఅవుట్లలో పెద్ద కాలనీలు ఉన్న చోట అందమైన ఆర్చీలను నిర్మిస్తున్నామన్నారు. మౌలిక వసతులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కొత్తగా సుడాలో చేరిన గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నామన్నారు. ఇంకా అర్హత కలిగి ఉండి స్థలం, ఇళ్లు మంజూరు కాని వారు దరఖాస్తు చేసుకుంటే 90 రోజుల్లో మంజూరు చేసే విధంగా చొరవ తీసుకోవాలని కోరారు. అనంతరం ఇళ్ల నిర్మాణ నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి సుధాకర్, కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ నరసింహారావు, తహసీల్దార్ ప్రద్యుజ పాల్గొన్నారు.

టీడీపీ నేతల కోడిపందేల జోరు



కోడిపందేలు నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

ఆత్మకూరురూరల్: పోలీసు హెచ్చరికలను పట్టించుకోకుండా టీడీపీ నాయకులు సాక్ష్యాత్తు తమ ఇంటి వద్దే కోడిపందేలు నిర్వహించారు. మండలంలోని కరటంపాడులోని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గూటూరు మురళీ కన్నబాబు, వేమన రామచంద్రయ్య నాయుడులు కనుమ పండగ సందర్భంగా సోమవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు జోరుగా కోడిపందేలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కరటంపాడు మాజీ సర్పంచ్ గార్లపాటి వేణుగోపాల్‌నాయుడితోపాటు ఆత్మకూరు, మర్రిపాడు, అనంతసాగరం మండలాలకు చెందిన పలువురు గ్రామ స్థాయి నాయకులు కూడా విచ్చేశారు.

అసైన్‌మెంట్ భూముల పంపిణీకి శ్రీకారం

- 8వ విడతగా సుమారు 5 వేల ఎకరాలకు పట్టాల పంపిణీ
- గ్రామ సభల ద్వారా పారదర్శకంగా జాబితాల తయారీ
- అవినీతికి పాల్పడిన ఆరుగురు తహసీల్దార్లకు 22న నోటీసులు
- జేసీ రోణంకి కూర్మనాథ్



మాట్లాడుతున్న జేసీ కూర్మనాథ్

నెల్లూరు (అర్బన్): ఎప్పటి నుంచో ప్రభుత్వ అసైన్డ్ భూములను సాగు చేసుకుంటున్న అర్హత కలిగిన పేద రైతులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. జిల్లాలో అలాంటి రైతులను గుర్తించి వారికి పట్టాలు పంపిణీ చేసేందుకు జిల్లా యంత్రాంగం జాబితాను సిద్ధం చేసింది. ఇందుకు సంబంధించిన వివరాలను జేసీ రోణంకి కూర్మనాథ్ సాక్షికి మంగళవారం వివరించారు. గతంలో జిల్లాలో 7 విడతలుగా భూపంపిణీ జరిగిందని, తాజాగా 8వ విడతగా సాగు చేసుకుంటున్న నిరుపేదలకు మరోమారు వచ్చే వారం నుంచే భూ పంపిణీ చేస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించి అసైన్‌మెంట్ కమిటీ ఆమోదం కూడా పూర్తయిందన్నారు. నెల్లూరు డివిజన్‌లో 2,400 ఎకరాలు, కందుకూరు డివిజన్‌లో సుమారు 550 ఎకరాలకు సంబంధించి జాబితా సిద్ధం చేశామన్నారు. కావలి, ఆత్మకూరు డివిజన్లకు సంబంధించి మరో రెండు, మూడు రోజుల్లో జాబితా సిద్ధం కానుందన్నారు. జిల్లా మొత్తం మీద సుమారు 5 వేల ఎకరాలకు పట్టాలు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. గతంలో సీజేఎఫ్‌ఎస్ పట్టాలు ఇచ్చి రద్దు చేసిన వారికి, మాజీ మిలిటరీలకు, పేద ప్రజలకు సంబంధించి భూమిని సాగు చేసుకుంటున్న వారికి పారదర్శకంగా పట్టాల పంపిణీ జరుగుతుందన్నారు. దీంతో ఆ రైతులకు హక్కులు లభిస్తాయన్నారు.

అవినీతి రెవెన్యూ అధికారులకు 22న నోటీసులు

ప్రభుత్వ భూములను, అటవీ భూములను భూసేకరణ కింద చూపి అక్రమంగా పరిహారం పొందేందుకు సహకరించిన తహసీల్దార్లు, అటవీ భూమిని సొంత భూమిగా చూపించి భూసేకరణలో పరిహారం పొందేందుకు సహకరించిన తహసీల్దార్లు ఆరుగురికి ఈ నెల 22న నోటీసులు పంపుతున్నామన్నారు. వారిపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. 26 వేల మంది రైతుల చుక్కల భూములకు సంబంధించి సుమారు 44 వేల ఎకరాలను నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు అన్ని చర్యలు చేపట్టామన్నారు. దీంతో దశాబ్దాల తరబడి ఎదురు చూస్తున్న రైతులకు ఎంతో మేలు జరగనుందన్నారు. జిల్లాలో జరుగుతున్న రీసర్వే ద్వారా ఖాతా నంబర్లు తప్పుబడినా, సర్వే నంబర్లు తప్పుబడినా రికార్డుల్లో సరిదిద్ది రైతులకు శాశ్వత ఉపయోగం జరిగేలా, పట్టాదారు పాసుపుస్తకాలు అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. రీసర్వే పూర్తి చేసి రైతుకు ఎల్‌పీఎం నంబర్ ఇస్తామన్నారు. నెల్లూరు నగరంలో కొంత మంది పెట్రోలు బంకుల యజమానులు కల్తీ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఆకస్మిక తనిఖీలు చేయడం ద్వారా వారి ఆటకట్టించేందుకు చర్యలు చేపడుతున్నామని వివరించారు.

అట్రాసిటీ కేసులపై
డీఎస్పీల విచారణ

ఆత్మకూరు: మండలంలోని అప్పారావుపాళెం గ్రామంలో ఆత్మకూరు డీఎస్పీ ఎస్.కోటారెడ్డి, నెల్లూరు దిశ డీఎస్పీ సురేష్‌బాబు మంగళవారం విడివిడిగా గ్రామాన్ని సందర్శించి అట్రాసిటీ కేసులపై విచారణ నిర్వహించారు. ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాసులు, జెడ్పీటీసీ సభ్యురాలు ప్రసన్నలక్ష్మి, వార్డు సభ్యుడు శ్రీనివాసులునాయుడు తదితరులతో మాట్లాడి వివరాలను నమోదు చేసుకున్నారు. అయితే వారిపై ఫిర్యాదు చేసిన స్థానిక సర్పంచ్ సోమాకుమారి విచారణకు హాజరుకాలేదు. వివరాలిలా ఉన్నాయి. ఇటీవల పంచాయతీ సమావేశం జరుగుతుండగా టీడీపీ మద్దతుదారుడైన మల్లికార్జుననాయుడు హాల్లోకి వచ్చేందుకు ప్రయత్నించాడు. ఈక్రమంలో అలా రాకూడదని చెప్పిన పంచాయతీ కార్యదర్శి బొటిక నరసింహులును అతను కులం పేరుతో దూషిస్తూ నానా యాగి చేశాడు. దీనికితోడు మల్లి కార్జుననాయుడు పంచాయతీ సమావేశాన్ని వెలుపల నుంచే వీడియోలు, ఫొటోలు తీశాడు. దీంతో కార్యదర్శి అదేరోజు సాయంత్రం ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో తనను కులం పేరుతో దూషించిన విషయంపై ఫిర్యాదు చేశాడు. ఈక్రమంలో సర్పంచ్ సోమాకుమారి తనను ఎంపీపీ, ఎంపీడీఓ, జెడ్పీటీసీ కులం పేరుతో దూషించారని టీడీపీ మద్దతుదారుడి ప్రోద్బలంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ రెండు కేసులను నమోదు చేసుకున్న పోలీసులు జిల్లా ఉన్నతాధికారులకు తెలిపారు. వారి ఆదేశాల మేరకు ఇద్దరు డీఎస్పీలు గ్రామంలో విచారణ చేశారు. ఫిర్యాదు చేసిన సర్పంచ్ విచారణకు రాకపోవడం ఏమిటని గ్రామస్తులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ నేతల మాట విని..

ఈ విషయంపై ఎంపీపీ, ఎంపీడీఓ, జెడ్పీటీసీ స్పందిస్తూ మహిళా సర్పంచ్ చేసిన ఆరోపణలను ఖండించారు. ఆమె టీడీపీ నాయకుల మాటలు విని అసత్యాలు మాట్లాడుతోందన్నారు. సమావేశంలో సోమాకుమారిపై దౌర్జన్యం చేయలేదని, ఆమెకు ఎంతో గౌరవం ఇచ్చామన్నారు. సమావేశానికి సంబంధం లేని వ్యక్తి వచ్చి ఫొటోలు, వీడియోలు తీయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు.

- ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల షాపులపై నిఘా
- రైతులు బిల్లులు తీసుకోవాలంటున్న అధికారులు
- రికార్డుల్లేని రూ.1.50 కోట్ల విలువైన సరుకు సీజ్

నాణ్యతే ప్రధానం

నెల్లూరు(సెంట్రల్): అన్నదాతల కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపట్టి అండగా ఉంది. సాగు కోసం పెట్టుబడి సాయం అందజేస్తోంది. ఆర్బీకేలు ఏర్పాటు చేసింది. అవి వారికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. విత్తనం నాటినప్పటి నుంచి పంట చేతికొచ్చే వరకు రైతులకు వెన్నుదన్నుగా ఉంటోంది. ఈ నేపథ్యంలో రైతులకు షాపులు విక్రయించే విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నాణ్యత విషయంలో రాజీ పడడంలేదు. అప్రమత్తంగా ఉంటూ అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లాలో..

జిల్లాలో 470 ఎరువుల రిటైల్ షాపులు, 17 హోల్‌సేల్ షాపులున్నాయి. కాగా 615 పురుగు మందుల షాపులు, 225 విత్తనాల దుకాణాలున్నాయి. వీటిల్లో కొనుగోలు చేసిన సమయంలో రైతులకు బిల్లు ఇవ్వాల్సి ఉంటుంది. బిల్లు తీసుకున్న రైతులు కొనుగోలు చేసిన వాటిలో ఎటువంటి సమస్య ఉన్నా బిల్లు ఆధారంగా చట్టం ప్రకారం విక్రయదారులపై చర్యలు తీసుకునేందుకు వీలు ఉంటుంది.

సరుకు సీజ్

షాపుల్లో పురుగు మందులు, ఎరువులు, విత్తనాలు విక్రయాలు చేసే నిర్వాహకులు ఎంత స్టాకు ఉంది?, ఎప్పుడు తెచ్చారు?, ఎంత విక్రయించారు? తదితర వివరాలు రికార్డుల్లో నమోదు చేయాలి. అయితే కొందరు సక్రమంగా రికార్డులు ఉంచడంలేదని సమాచారం అందడంతో వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేస్తున్నారు. రికార్డులు సక్రమంగా లేకపోవడంతో ఆరునెలల కాలంలో రూ.1.50 కోట్ల సరుకును సీజ్ చేశారు.



రికార్డులను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు (ఫైల్)

ప్రత్యేక నిఘా

జిల్లాలో సంవత్సరానికి సుమారు 6 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తుంటారు. సుమారు 1.50 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు, 2 లక్షల లీటర్ల పురుగు మందులను వినియోగిస్తుంటారని అంచనా. వరి సాగే ఎక్కువగా ఉంటుంది. కాగా పురుగు మందులు, ఎరువులు, విత్తనాల విషయంలో ఎక్కడా రైతులు ఇబ్బందులు పడకుండా పక్కాగా, నాణ్యమైన సరుకులు అందేలా వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో నిఘా పెట్టారు. ఈక్రమంలో తనిఖీలను ముమ్మరంగా చేస్తున్నారు.

తనిఖీలు చేస్తున్నాం



జిల్లాలోని పురుగు మందులు, ఎరువులు, విత్తనాలు విక్రయాలు చేసే షాపుల్లో నిరంతరం తనిఖీలు చేస్తున్నాం. ఎక్కడైనా రికార్డులు సక్రమంగా లేకుంటే చర్యలు తీసుకుంటాం. అదే విధంగా కొనుగోలు చేసిన రైతులకు తప్పకుండా బిల్లు ఇవ్వాలి. రైతులు కూడా బిల్లు అడిగి తీసుకుంటే మంచిది. – సుధాకర్‌రాజు, జేడీ, వ్యవసాయ శాఖ

హత్య కేసులో నిందితుడి అరెస్ట్



మాట్లాడుతున్న సీఐ కోటేశ్వర్రావు

బుచ్చిరెడ్డిపాళెం: హత్య కేసులో నిందితుడిగా ఉన్న రాజశేఖర్ అనే వ్యక్తిని మంగళవారం అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచామని సీఐ కోటేశ్వర్రావు తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. స్థానిక చాకలివీధిలో ఓబులేసు అనే వ్యక్తి ఇంట్లో రాజశేఖర్ అద్దెకు ఉంటున్నాడు. అతను మద్యానికి బానిసయ్యాడు. భార్య రోజూ కూలి పనులకు వెళ్లి తెచ్చిన డబ్బును తీసుకెళ్లి తాగేసేవాడు. నిత్యం భార్యను వేధించేవాడు. దీంతో ఆమె ఇటీవల పుట్టింటికి వెళ్లిపోయింది. ఈనెల 13వ తేదీ వేకువజామున రాజశేఖర్ ఫూటుగా మద్యం తాగి ఇంటికొచ్చి పెద్దగా కేకలు వేశాడు. దీంతో యజమాని ఓబులేసు అతడు ఉంటున్న గదికి వెళ్లి ఎందుకు అరుస్తున్నావు?, అద్దె డబ్బులు చెల్లించి ఇంటిని ఖాళీ చేయాలన్నాడు. దీంతో రాజశేఖర్ తననే డబ్బులు అడుగుతావా? అంటూ స్క్రూ డ్రైవర్‌తో ఓబులేసు తలపై బలంగా పొడిచాడు. అతను పెద్దగా కేకలు వేయడంతో అక్కడే ఉన్న తాడును ఓబులేసు మెడకు చుట్టి హత్య చేశాడు. మృతిచెందినట్లు నిర్ధారించుకుని గదిలో ఉన్న పరుపులో మృతదేహాన్ని చుట్టి దానిపై దుప్పట్లు కప్పాడు. అనంతరం రక్తపు మరకలను కడిగి గదికి తలుపులు వేసి పక్కింటి వారికి తాళాలు ఇచ్చి వెళ్లిపోయాడు. దీనిపై కేసు నమోదు చేసి నిందితుడు కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. మంగళవారం రాజశేఖర్‌ను అరెస్ట్ చేశారు. సమావేశంలో ఎస్సై వీరప్రతాప్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు విరివిగా రుణాలిచ్చాం

- కోవూరు ఎమ్మెల్యే చొరవతోనే చైర్మన్‌గా కొనసాగా
- నూరా శ్రీనివాసులురెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: వవ్వేరు కో–ఆపరేటివ్ రూరల్ బ్యాంకు చైర్మన్‌గా తాను ఉన్న సమయంలో అన్నదాతలకు విరివిగా రుణాలిచ్చినట్లు నూరా శ్రీనివాసులురెడ్డి తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలో ఉన్న వవ్వేరు బ్యాంకులో మంగళవారం ఆయన చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. అనంతరం మాట్లాడుతూ కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చొరవతోనే తాను 2013 సంవత్సరం నుంచి చైర్మన్‌గా కొనసాగానన్నారు. ఈ పదేళ్ల కాలంలో బ్యాంకును అభివృద్ధి బాటలో నడిపించానన్నారు. తాను చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టినప్పుడు బ్యాంకు ఆదాయం రూ.70 లక్షలుగా ఉండేదని ప్రస్తుతం రూ.4.5 కోట్ల నికర ఆదాయం ఉందన్నారు. రుణాలను సకాలంలో మంజూరు చేయడంతోపాటు వసూళ్లను కూడా చేపట్టడంతో బ్యాంకు అభివృద్ధి బాటలో ఉందన్నారు. ఇందుకు కారణమైన ప్రతి రైతుకు కృతజ్ఞతలు తెలిపారు. స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్నానని, ఇందులో ఎలాంటి రాజకీయ కోణం లేదన్నారు. ఏ పార్టీలోకి వెళ్లడంలేదని, చివరి వరకు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డితో వెంటే నడుస్తానని తెలిపారు. అనంతరం తన రాజీనామా పత్రాన్ని బ్యాంకు మేనేజర్‌కు అందజేశారు. ఆయన వెంట త్రిసభ్య కమిటీ సభ్యులు కోవూరు మురళి, శ్రీహరి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు టంగుటూరు మల్లికార్జునరెడ్డి, నాయకులు అల్లాభక్షు, శివకుమార్‌రెడ్డి, ద్వారకానాథ్‌రెడ్డి, పెంచలయ్య, మధు, ప్రసాద్ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న శ్రీనివాసులురెడ్డి

రూ.27 కోట్ల మద్యం విక్రయాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలో 13 నుంచి 16వ తేదీ వరకు రూ.27,77,39,071 విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. ఏపీఎస్‌బీసీఎల్, నెల్లూరు ఐఎంఎఫ్‌ఎల్ డిపో అధికారులు పండగ సీజన్లో జరిగిన మద్యం విక్రయాల వివరాలను మంగళవారం వెల్లడించారు. 29,353 కేసుల మద్యం, 7,731 కేసుల బీరు బాటిళ్లను నాలుగురోజుల్లో విక్రయించారు.

నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.37
సన్నవి	: రూ.20
పండ్లు	: రూ.7



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 116
లేయర్ (లైవ్)	: 100
బ్రాయిలర్ చికెన్	: 204
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 226
లేయర్ చికెన్	: 170



ప్రతి గడపలో ఘన స్వాగతం



బిట్రగుంట: ఎస్వీపాళెంలో బుక్‌లెట్ అందజేస్తున్న కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

సాక్షి, నెట్‌వర్క్: గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న ప్రజాప్రతినిధులకు ప్రజలు ఘన స్వాగతం పలుకుతున్నారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి బోగోలు మండలంలోని శ్రీవెంకటేశ్వరపాళెం పంచాయతీలో, కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి కందుకూరు మండలంలోని మహదేవపురం సచివాలయం పరిధిలో ఉన్న కాకి బంగారుపాళెంలో మంగళవారం పర్యటించారు. సంక్షేమ పథకాల వల్ల జరిగిన లబ్ధిని ప్రజలకు వివరించి బుక్‌లెట్లు పంపిణీ చేశారు. నాయకులు మాట్లాడుతూ గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రజలకు సంక్షేమ పథకాలు పక్కాగా అందుతున్నాయన్నారు. ఈ ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పథకాలతో ప్రతి ఇంట్లో ఆనందం వెల్లివిరుస్తోందన్నారు. ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబునాయుడిని ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే గెలిపిస్తారన్నారు.



కందుకూరు: కాకిబంగారుపాళెంలో పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి

యువకుడి ఆత్మహత్య

తోటపల్లిగూడూరు: మండలంలోని వరిగొండ గ్రామానికి చెందిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం వెలుగు చూసింది. ఎస్సై ఇంద్రసేనారెడ్డి కథనం మేరకు.. వరిగొండ దళితకాలనీకి చెందిన వెంకటరమణయ్య ఐదు సంవత్సరాల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఆరునెలల క్రితం అతడి భార్య భారతి ఇద్దరు పిల్లలతో తన అమ్మగారి ఊరైన కొడవలూరు రాజుపాళేనికి చేరుకుంది. ఆమె వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. భారతి కుమారుడు వంశీ (22) కనుమ పండగను మిత్రులతో చేసుకునేందుకు సోమవారం ఉదయం రాజుపాళెం నుంచి స్వగ్రామమైన వరిగొండకు వచ్చాడు. రోజంతా మిత్రులతో గడిపిన వంశీ రాత్రి తన నివాసంలో ఒంటరిగా నిద్రపోయాడు. మంగళవారం ఉదయం అతను ఇంటి నుంచి బయటకు రాకపోవడంతో ఇరుగుపొరుగు వారు కిటికీలో నుంచి చూశారు. వంశీ ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించాడు. వెంటనే తలుపులు పగులగొట్టి యువకుడిని కిందకు దించగా అప్పటికే మృతిచెంది ఉన్నాడు. కనుమ రోజు స్నేహితులతో సరదాగా గడిపిన వంశీ ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడో ఎవరికీ అర్థం కాలేదు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై ఇంద్రసేనారెడ్డి